జన్మతరించింది.

"డబ్బుకట్టవేఁటయ్యా?" అడిగేం.

"డబ్బేంటండీ?" అన్నాడు.

"మరి అప్పుడు అన్ని లక్షలు పుచ్చుకున్నావు?" కసిరేదు కామేశం.

అతను తొణకలేదు. బెదరలేదు!.

అచ్చు మేకలాగే నవ్వేడు (మేకలు నవ్వవు. కాని అతని నవ్వులో అమాయకత్వం మేకని గుర్తుచేస్తుంది. అంతే!).

బావుందండి. ఆ నాను డబ్బు తీసుకోవటవేంటండి? ఆ ఎంకటేశం బాబొచ్చి "ఒరే కిట్టప్పా! సర్కారోళ్ళు నీలాటోళ్ళందరికీ మేకలు ఊరికే ఇస్తున్నారు. సంతకం ఎట్టు అన్నాడండి. నాకేటి ఎరికండి? ఎట్టేసినానండి. అంతే!" అన్నాడు.

"నీకు సంతకం పెట్టడం కూడా వచ్చునా కృష్ణావతారం?" విశ్వనాథం విసుక్కున్నాడు.

"ఆ బాబే నేర్పినాడండి"

"ఏడీవాడు"

"నాకేటి ఎరికండి?" అదీ

ముల్లుకు కత్తి వచ్చె ఢాం ఢాం అని పిచిక కథలాగ మూడు లక్షలకి ముప్పై మేకలు వచ్చేయి ఢాం ఢాం అని డప్పుకొట్టు కుంటూ మర్నాడు మరో అప్పు వసూలుకి బైల్దేరేం.

ఏ గేదెల వాడు తగుల్తాడో!

"పొగతాగని వాడు దున్నపోతై పుట్టున్" అన్నది గిరీశం నాటి మాట.

"లంచం తీసుకోని వాడు అడ్డగాడిదై పుట్టున్" అన్నది ఈనాటి మాట. అందుకేనేమో కరప్షన్ ఈజ్ గ్లోబల్ ఫినామినా అన్నది ఇందిరాగాంధీ!.

**(ఆంధ్రప్రభ, వారపత్రిక, 26.6.1996)**

# పిచ్చిపక్షి

**అ**ప్పటికింకా డెమోక్రసీ రాలేదు.

బ్రిటీషువారూ రాలేదు.

రాజులే రాజ్యం ఏలుతున్నారు.

అనగా అనగా ఓ రాజుగారు.

ఆ రాజుగారు ఓ నాటి సభలో తీరిగ్గా ఆసీనులై, మంత్రి వగైరాలతో తమ ప్రజల యోగక్షేమం చర్చిస్తున్నారు.

(డెమోక్రసీ వచ్చాక ప్రభువులు ప్రజల యోగక్షేమాలు చర్చించడం మానేశారు)

చర్చ చాలా సీరియస్‌గా సాగుతోంది.

ఇంతలో ....

దూరంగా పెద్ద గోల.

ఆ గోలేఁవిటో చూసిరమ్మని మంత్రిగారు భటుల్ని తక్షణం పంపించేశారు.

భటులింకా ద్వారం దాటనేలేదు.

ద్వారపాలకుల మాట లెక్కచెయ్యకుండా ఒక పెద్ద నెమళ్ల మంద సభలో కొచ్చేసింది.

ఒక్క నిముషం సభంతా నిశ్శబ్దం.

రాజుగారువిచిత్రంగా చూస్తున్నారు.

సభలోకి ప్రజలు తప్ప ఇలా నెమళ్ళు లేళ్లు రావటం ఇంత వరకు జరగలేదు.

"ఏఁవిటి మీ సమస్య?" అడిగారు మంత్రిగారు

ఆ రాజుల్లో రాజులకి, మంత్రులకి మానవ భాషే కాకుండా జంతుభాష, పక్షిభాష కూడా వచ్చేవి.

సభంతా నిశ్శబ్దం.

ఒక ముసలి నెమలి – అది లీడరు –

ముందుకొచ్చి సాష్టాంగ నమస్కారం చేసింది.

దాని వినయానికి అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. ఆ వేలు తీసే లోపల అది మంత్రిగారికి మామూలు నమస్కారం చేసింది.

సభికులు మళ్లీ ఆశ్చర్యపోయారు.

తరువాత ఆ నెమలి కొంచెం రాజుగారికి దగ్గరగా వచ్చి చేతులు కట్టుకుని చెప్పింది –

"మహాప్రభో! తవఁరు ధర్మ ప్రభువులు. తమ రాజ్యంలో కష్టాలు లేవని ప్రజలు అనుకుంటున్నారు. మాకు మాత్రం తగని కష్టం వచ్చింది. తవఁరే తీర్చాలి!" అని ఎఫెక్టు కోసం ఆగింది.

మిగతా నెమళ్లు కళ్లు ఒత్తుకున్నాయి.

ఎఫెక్టు పూర్తి అయింది.

"ఏఁవిటి మీ కష్టం? మా రాజ్యంలో చీమకూడా కష్టం రాకూడదు!" అన్నారు మంత్రిగారు.

"మనవి చేస్తున్నాను, మహాప్రభో!చీమ సంగతి మాకు తెలీదు కానీ, మా నెమళ్ల తోటలోకి కొండ చిలువలు ప్రవేశించాయి.ఏ చెట్టును చూసినా అవే. ఏ కొమ్మని చూసినా అవే. మాకు నిలువ నీడ లేదు. మమ్మల్ని అక్షరాలా తినేస్తున్నాయి!" అంది ఆ లీడరు గంభీరంగాను, దీనంగానూ.

"ఇక్కడికెంత దూరం మీతోట?" ఈసారి రాజుగారే అడిగారు.

"పది మైళ్లుండవచ్చు!" అన్నాయి నెమళ్లు ముక్తంకంఠంతో.

తోట తక్షణం ఖాళీ చెయ్యమని కొండచిలువలకి ఫర్మానా పంపించేశారు రాజుగారు.

కొండచిలువలు తొణకలేదు, బెణకలేదు.

ఖాళీ చెయ్యలేదు.

సరికదా, "ఏ తోటలోకి రావాలంటే ఆ తోటలోకి వెళ్లడం, కొమ్మలకి చుట్టుకోవడం మా ప్రాథమిక హక్కు. అసలు విష్ణుమూర్తి వారెక్కడ పడుకునేవారు? కాకపోతే మాకు పడగ లేదు. కానీ జాతి ఒకటే కదా! అతని పానుపు మా వంశీయుడే కదా! మరింత మాకెవరూ అడ్డులేదు. రావడానికి వీల్లేదు. మేము వెళ్లం!" అని వాదించాయి.

వాదన కొట్టిపారెయ్యడానికి విష్ణుమూర్తి, చట్టం అడ్డువచ్చాయి.

దేవుడ్ని కాదనే ధైర్యం రాజుగారికి లేదు.

మరీ నెమళ్ళమాటేమిటి?

ఇవి మైనారిటీ అయిపోయాయి.

వీటికేదైనా స్థలం చూపించకపోతే ఇవి ఊరుకోవు.

"పోనీ మీరు ఆ పక్క తోటలోకి వలస వెళ్లండి.ఏ తోట అయితేనేం?" అని మంత్రి నెమళ్లకి నచ్చ చెప్పబోయాడు.

"ఆ మాట ఆ కొండ చిలువలకే చెప్పవచ్చు కదా! మేము కొన్ని తరాల నుండి ఇక్కడే ఉంటున్నాం. మా సెంటిమెంటు మాకుంటుంది కదా!" అంది లీడరు నెమలి.

మంత్రిగారు ఒక్క నిముషం మాట్లాడలేదు.

ఇంతలోరాజుగారు అందుకున్నారు –

"సెంటిమెంటు పక్కన పెట్టండి.కొన్ని తరాలుఇక్కడున్నారు కదా, ఇప్పుడుకొన్ని తరాలు అక్కడ ఉండండి, ఎవరో ఒకరు సర్దుకుపోవాలి కదా!" అన్నారు.

"అంతేలెండి, ఎప్పుడూ బలవంతుడే గెలుస్తాడు!" అని సణుక్కుంటూ ఒప్పుకున్నాయి.

ఆ తరువాత తరచుగా రాజుగారి కోటలోను, వారి సిబ్బంది ఇళ్లలోనూ నెమలి మాంసం వండుతూనే ఉన్నారు.

**(ఆంధ్రప్రభ వారపత్రిక, 23.11.1998)**

# నేలమీద నక్షత్రం

**అ**ప్పుడప్పుడు నాకు గొప్ప వేదాంతం వచ్చేస్తుంది.

ఏవిటీ వెధవ జీవితం?

దీని అర్థం ఏమిటీ?

మనం మామూలుగా బతకడం లేదు. బతుకుతో బిజినెస్ చేస్తున్నాం.

మనం విధి చేతిలో కీలుబొమ్మలం అనేవారు.

ఇప్పుడు డబ్బుచేతిలో కీలుబొమ్మలం.

గారడీవాడు కోతిని ఆడించినట్టు, డబ్బు మనల్ని ఆడిస్తోంది.

ఈ జీవితపు పరుగుపందెంలో గెలుపు ఎప్పుడూ డబ్బుదే.

నా వేదాంత ధోరణి ఎంతసేపు సాగేదో కానీ ఇంతలో భూకంపంలా వార్నింగు లేకుండా వచ్చాడు భాస్కరం.

అకాల వర్షంలా అకాల రాకేవిట్రా అన్నాను.

వాడు ముందు ఒక చిరునవ్వు నవ్వాడు. తరువాత సాఫీగా తాపీగా సోఫాలో పుస్తకాలు వగైరా తీసి టేబిలు మీద పెట్టాడు. నిదానంగా సోఫాలో కూర్చున్నాడు. రెండు కాళ్ళూ ఎదురుగా ఉన్న బల్లమీద పెట్టాడు.

మాట్లాడవేం? అన్నాను.

"నీకన్నీ తొందరే. చెప్పేవరకు ఆగవు. ఏవుందీ? వచ్చి పదిహేను రోజులైంది. కథేవిటంటే అమ్మ, నాన్న ఓ అరడజను అమ్మాయిల్ని సెలెక్టు చేసి వుంచారు. కానీ ఎందుకో నాకు ఎవరూ నచ్చలేదు. ఇటు చూస్తే నా సెలవు అయిపోతోంది. పోనీ మరో పది రోజులు పొడిగిద్దామంటే మూఢం వస్తుందిట. మూఢా